www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 జులై 2025

పూడికతీత పనులు ప్రారంభం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మెయిన్ డ్రెయినేజీలో పూడికతీత కార్యక్రమానికి అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. డ్రెయినేజీలో పూడికను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులను 'డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి' అని 'ప్రజాశక్తి' ఓ కథనాన్ని సోమవారం వెలుగులోకి తెచ్చింది. దీనిపై ఎంపిడిఒ ఎ.రాజు ఆదేశాలతో గ్రామ కార్యదర్శి శ్రీలలిత మెయిన్ డ్రెయిన్‌లో పూడికతీత పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం పర్యవేక్షించారు.

డ్రెయినేజీని శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి

రాజోలులో వలస నేతల హవా..!

- ఏడాదికాలంగా టిడిపికి ఇన్‌ఛార్జ్ కరువు
- పావులు కదుపుతున్న పేరాబత్తుల
- పోటీలో పలువురు ఆశావహులు
- చెల్లుబోయిన వైపు అధిష్టానం చూపు..?

రాజోలు నియోజకవర్గంలో వలస నేతల పెత్తనం పెరిగిపోతోంది. అధికార టిడిపి మొదలుకొని విపక్ష వైసిపి వరకు రాజోలుపై వలస నేతల హవా కొనసాగుతోంది. ముఖ్యంగా టిడిపిపై దాదాపు దశాబ్ద కాలం పైబడి వలస నేతల ఏలుబడి ప్రభావం కనిపిస్తుంది. టిడిపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో స్థానిక నాయకత్వం రోజు రోజుకు నిర్వీర్యం అవుతోంది.



ప్రజాశక్తి - రాజోలు

2014 ఎన్నికల్లో రాజోలు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గొల్లపల్లి సూర్యారావు విజయం సాధించారు. దీంతో ఈ నియోజకవర్గంలో వలస నేతల హవా మొదలైంది. కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెంకు చెందిన గొల్లపల్లి రాజోలు నుంచి ఎంఎల్‌ఎగా గెలిచాక ఇక్కడే పాగా వేశారు. 2014 నుంచి 19 వరకు ఎంఎల్‌ఎగా, 2019-24 మధ్య నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా రాజోలులో గొల్లపల్లి పెత్తనం చేశారు. 2024 ఎన్నికలలో ఈ సీటును జనసేనకు కేటాయించడంతో గొల్లపల్లి వైసిపిలోకి జాయిన్ అయ్యారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇక్కడ నుంచి ఓటమి పాలయినా నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్‌గా గొల్లపల్లి తన హవాను కొనసాగిస్తున్నారు. గొల్లపల్లి పార్టీ మారాక ఇప్పటి వరకు రాజోలు నియోజకవర్గ టిడిపికి ఇన్‌ఛార్జ్‌ని అధిష్టానం నియమించలేదు. అయితే నాటి నుంచి నేటి వరకూ గొల్లపల్లి సూర్యారావు టిడిపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సమయంలో నియమించిన మండల కమిటీల నేతలే నేటికీ ఉండటం విశేషం. దీంతో ప్రత్యక్షంగా అటు వైసిపిలో, పరోక్షంగా ఇటు టిడిపిలో వలస నేత గొల్లపల్లి పెత్తనమే కొనసాగుతోంది. ఇటీవల టిడిపి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చేపట్టడంతో కొత్త కమిటీలతో పార్టీ ప్రక్షాళన జరుగుతుందని ఆశించిన టిడిపి శ్రేణులకు కొందరు నేతల తీరుతో ఆశాభంగం తప్పలేదు. సంస్థాగత ఎన్నికలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేయడానికి రాజోలు నియోజకవర్గానికి పరిశీలకుడిగా ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరంను పార్టీ అధిష్టానం నియమించింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎంఎల్‌సిగా ఎన్నికైన పేరాబత్తుల ఒకప్పుడు కోనసీమ వాసే అయినప్పటికీ ప్రస్తుతానికి కాకినాడలో స్థిర పడ్డారు. గతంలో ముమ్మిడివరం నియోజకవర్గ ప్రతినిధిగా అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శిగా పని చేసిన పేరాబత్తుల ఆ తరువాత కాకినాడ రూరల్ నియోజకవర్గం టిక్కెట్టును ఆశించి అక్కడకు చిరునామా మార్చుకున్నారు. అయితే గత ఎన్నికలలో ఆ సీట్ జనసేనకు కేటాయించడంతో కాకినాడ రూరల్ టిడిపి ఇన్‌ఛార్జ్ హోదా అయినా పొందాలని చూశారు. అయితే అధిష్టానం కాకినాడ టిడిపి కోఆర్డినేటర్‌గా టిడిపి నేత పిల్లి సత్తిబాబుకు, కో - కోర్డినేటర్ గా కటకంశెట్టి బాబీకి అవకాశం ఇచ్చింది. తరువాత పేరాబత్తులకు ఎంఎల్‌సి అవకాశం దక్కింది. అయితే ఏదో ఒక నియోజకవర్గంపై పెత్తనం చేయాలనే కోరిక మాత్రం ఆయనకు నెరవేరలేదు. ఈలోపు రాజోలు పరిశీలకుడి బాధ్యతలు రావడంతో పేరాబత్తుల పంట పండింది. గొల్లపల్లి హయాంలో పదవులు పొందిన నాయకులు ఇక్కడ తమ పెత్తనం పోకుండా చూసుకునేందుకు పేరాబత్తులకు వంత పాడటంతో ఈ నియోజకవర్గంపై ఆయన కన్ను పడింది. సంస్థగత ఎన్నికల పరిశీలకునిగా వచ్చిన పేరాబత్తుల ప్రస్తుతం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి కూడా పరిశీలకునిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో రాజోలు నియోజకవర్గానికి టిడిపి ఇన్‌ఛార్జ్‌ని నియమిస్తారని పదే పదే చెబుతున్న పేరాబత్తుల అధిష్టానం ఎవరినీ నియమించకపోతే తానే బాధ్యత తీసుకుని నియోజకవర్గాన్ని నడిపిస్తానని చెప్పడం చర్చానీయాంశంగా మారింది.

ఆశావాహుల ఎదురుచూపులు

సంస్థాగత ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో టిడిపి ఇన్‌ఛార్జ్ పదవి కోసం ఆశావాహులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పదవిని భర్తీ చేసేందుకు పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవిని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, గెడ్డం సింహ, మాజీ ఇన్‌ఛార్జ్ బత్తుల రాము, గెడెల వరలక్ష్మి, మోకా పార్వతి ఆశిస్తున్నారు. ఇప్పటికే పార్టీ అధినాయకుడి మన్ననలు పొందడం కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ముఖ్యంగా చెల్లుబోయిన శ్రీనివాస్ మంత్రి లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ముఖ్యపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే చెల్లుబోయినకే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే ఎంఎల్‌సి పేరాబత్తుల మాజీ ఎంఎల్‌ఎ గొల్లపల్లి సన్నిహితులతో మమేకమై తనకు ఇన్‌ఛార్జ్ పదవిని ఇవ్వాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం చర్చానీయాంశంగా మారింది. ఏదిఏమైనా లోకల్ నాయుకునికి ఇన్‌ఛార్జ్ పదవిని కట్టబెట్టాలనే అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

సేంద్రియ సాగును ప్రోత్సాహించాలి

ప్రజాశక్తి - అమలాపురం

సేంద్రీయ వ్యవసాయాన్ని రైతాంగం ఆచరించేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎరువుల లభ్యత, ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాలు ఆచర ణ, ఖరీఫ్ సాగు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ ఆధారిత వ్యవసాయ పద్ధతిని ఆచరించడం ద్వారా ప్రజలకు సేంద్రియ ఆహార ఉత్పత్తులు లభ్యత పెరగడంతో పాటుగా మానవుల జీవన ప్రమాణం మెరుగవుతుందన్నారు. స్థానికంగా లభించే ముడి వనరులను వినియోగించడం ద్వారా హానికరమైన రసాయన ఎరువులు, వాడకం తగ్గడంతో పాటు పురుగు మం దులు వాడకం కూడా తగ్గుతుందన్నారు. తద్వారా నేల సంరక్షణ సంరక్షణ భూసారం మెరుగవుతూ భూములు చౌడు బారకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అటు ప్రజానీకానికి ఇటు భూమికి పరస్పర ప్రయోజనం కోసం మరియు వ్యవసాయాన్ని పశు పోషణతో అనుసంధా నించడానికి పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. పంటలకు పోషకాలను అందించి సేంద్రియ పదార్థాలు, జీవ ఎరువులతో రసాయనాలు లేకుండా తెగుళ్ళు కలుపు మొక్కలను నియంత్రించడానికి సహజ ప్రకృతి సేంద్రియ పద్ధతులు ఉపయోగపడతాయన్నారు. నేల, నీరు పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడుతూ, నేల సజీవంగా ఉండేలా రక్షణ కల్పించి స్థిరమైన దిగుబడిని సాధించే లక్ష్యంగా ప్రకృతి సేంద్రియ సాగును అన్ని విధాలా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు కొరత లేకుండా సరఫరా చేయాలని, ఎక్కడా అధిక ధరలకు అమ్మకుండా నియంత్రణ చర్యలు బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి, మార్క్ పేడ్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్యం కోసం రూ.1.50 లక్షల సాయం

ప్రజాశక్తి - అంబాజీపేట

రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందంపూడి, మాచవరం గ్రామాలకు చెందిన మోకా రమేష్, షేక్ సుల్తాన్‌ల వైద్య ఖర్చులకు బాల్య స్నేహితులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంబాజీపేట హైస్కూలులో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు రూ.1.50 లక్షలను సేకరించి సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జె.రాధాకృష్ణ, బండారు నాగమణి, అంకం భారతి, కేతా సతీష్, విజయ్, వలీ, బాలు, శ్రీను సుధాకర్ పాల్గొన్నారు.

గాయపడిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ఉపాధ్యాయులకు శిక్షగా మారుతున్నాయని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎస్.సుబ్బారావు సోమ వారం ఒక ప్రకటనలో విమర్శంచారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జరుగుతున్న ఎస్ఎల్‌డిపి శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా ఉన్న పాలకొల్లు మండలం అర్థకట్ల జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పని చేస్తున్న ఎస్‌విఆర్.మూర్తిరాజు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అధికారులు శిక్షణ పేరుతో ఉపాధ్యాయులకు తీవ్ర మానసిక వేదనకు గురిచేసి, వారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు కల్పించడం దారుణమన్నారు. దీనికి గల కారకులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల తెరచి, ఇప్పటికే రెండు నెలలు గడిచిన కాలంలో యోగడే, మెగా పేరెంట్స్ డే, ఆన్‌లైన్ వెబ్ ఎక్స్‌మీటింగ్స్, యాప్స్, ఎస్ఆర్‌కెవిఎం కిట్లు పంపిణీ మొదలైన కార్యక్రమాలతో ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేశారని అన్నారు. పాఠశాల సమయంలో శిక్షణ పేరుతో బోధన చేయకుండా ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం ఉపాధ్యాయుల ప్రాణాలను ఫణంగా పెట్టడం సరైంది కాదన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానం అమలు జరిగేలా అధికారులు, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతి కార్యాలయం ఆవరణలో ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, షరతులు లేకుండా ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని కోరారు. అనంతరం కార్మికులు వంట వార్పు నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకుడు యలమంచిలి బాలరాజు, మున్సిపల్ కార్మికులు ముక్కవిల్లి శ్రీనివాసరావు, ఎస్.అజయ్‌కుమార్, నక్కా అరుణ్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సరిపల్లి రామరాజు పాల్గొన్నారు.

కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

మరో 20 ఏళ్లు కూటమిదే అధికారం

ప్రజాశక్తి - కాట్రేనికోన

రాష్ట్రంలో జగన్ అరాచక పాలన భరించలేకనే కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని, మరో 20 ఏళ్ల పాటు అధికారంలో కూటమి ప్రభుత్వమే కొనసాగుతుందని రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర జోస్యం చెప్పారు. సోమవారం స్థానిక గ్రంధి నాగేశ్వరరావు ఫంక్షన్ హాల్‌లో ఎంఎల్‌ఎ దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా వైసిపి నాయకుల తీరు మారలేదన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని సైకోల తయారయ్యాడని, రాత్రి చీకట్లో కను సైగ చేస్తే టిడిపి నాయకులను అంతం చేయాలని పిలుపునిస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. వైసిపి నాయకుల అరాచకాలకు పేర్ని నాని ఉదాహరణ అన్నారు. కార్యకర్తలే టిడిపికి అధినేతలని, గత ప్రభుత్వ హాయంలో ఎన్ని దౌర్జన్యాలు చేసిన సైనికుల్లా కార్యకర్తలు ప్రతిఘటించారని అన్నారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పి-4 విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.35 వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రతి నెల వివిధ రకాల పెన్షన్లును అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల మందికి తల్లికి వందనం పేరట తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజవర్గం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని అన్నారు. ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నామన్నారు. వరదల సమయంలో లంక గ్రామాలు నది కోతకు గురి కాకుండా రూ.250 కోట్ల ప్రతిపాదనలతో గ్రోయిన్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, పిఎస్ఎన్ రాజు, మోకా ఆనంద్‌సాగర్, చెల్లి అశోక్, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 18న వేలం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వేలంను స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు. వేలం వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని జిల్లా ఎక్సైజ్ అధికారి నిర్ణయం మేరకు జరుగుతాయన్నారు. వేలంలో పాల్గొనేవారు గుర్తింపు కార్డు నకలు అందజేస్తూ రూ.2 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలం పాటలలో వాహనాన్ని దక్కించుకున్న వారు ఆ ధరతో పాటు అదనంగా 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనుమానాల నివృత్తి కోసం స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన కోరారు.

సిఐ నాగేశ్వరరావు

గవర్నర్ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మాజీ కేంద్రమంత్రి, టిడిపి సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడంపై టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు నల్లి మోహన్‌రావు, తాడి వేణు మాట్లాడుతూ అశోక్ గజపతిరాజు ఎంఎల్‌ఎగా, రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా రాష్ట్ర ప్రజలతో పాటు దేశానికి సేవలు అందించారని అన్నారు. మచ్చలేని నాయకుడిగా అవినీతికి దూరంగా ఉంటూ, ఆదర్శవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించారని కొనియాడారు. అశోక్ గజపతిరాజుకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. సోమవారం మండలంలోని అంకంపాలెం జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో 'ఉమెన్, గర్ల్ సేఫ్టీ, సైబర్ క్రైం, డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఐ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరగాళ్లో ఉచ్చులో పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇటీవల కాలంలో యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సదస్సులో ఎస్ఐ ఎస్.రాము, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీర గ్రామాల ప్రజలకు హెచ్చరిక

ప్రజాశక్తి - మామిడికుదురు

గోదావరి నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరికి వరద వస్తున్నందున నదిలో దిగి స్నానాలు చేయడాన్ని నిషేధించామని, కావున నిబంధనలు ఉల్లంఘించి నదిలో ప్రవేశించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యలంకలో ఉన్న పశువులను కరకట్టకు తరలించాలని సూచించారు. వరదకు కొట్టుకువచ్చే కలప కోసం, అలాగే చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వరద సహాయార్థం అత్యవసరమైతే 9440904853 ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు పిలుపునిచ్చారు. వైసిపి మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన దంగేటి రాంబాబును ఆమె సోమవారం చల్ల పల్లిలోని ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు తీవ్రమయ్యాయని, మహిళలకు జరుగు తున్న అన్యాయాలను ప్రజలకు వివరించి వైసిపికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కడలి సాయి బాబు, జొన్నాడ చిన్ని, ఉప్పలగుప్తపు ఈశ్వరరావు, జినిపె గంగరాజు, పరమట మురళిపాల్గొన్నారు.



రాంబాబును సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ విమర్శంచారు. సోమవారం మండలంలోని హసనబాద్ గ్రామంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ" కార్యక్రమం జరిగింది. మండల వైసిపి అధ్యక్షులు పోలీనాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేసి, మోసపూరిత హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అమలు కాని హామీలు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎంపిపి అంబటి భవాని మాట్లాడుతూ మహిళలకు రూ.18 వేలు ఇస్తామన్నా హామీని అమలు చేయలేదన్నారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి హామీలను విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు కుడుపూడి శ్రీనివాస్‌రావు, ఎపిఐడిసి మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ ఎంపిపి కట్టా సూర్యనారాయణ, నాయకులు పెమ్మిరెడ్డి మురళి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళా విభాగం నాయకురాలు సతీష్ కుమారి

కార్టూ'నిజం'

నాట్య పోటీల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థినులు నాట్య ప్రదర్శన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 10 నుంచి 13 వరకు విశాఖపట్నంలో జరిగిన 36వ ఆలిండియా క్లాసికల్ అండ్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్లో సినీ క్లాసికల్ డాన్స్ జూనియర్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని డి.కావ్యశ్రీ అత్యుత్తమ ప్రదర్శనతో మొదటి బహుమతిని, క్లాసికల్ గ్రూప్ జూనియర్ విభాగంలో రెండవ బహుమతిని సాధించింది. అలాగే నిడదవోలుకు చెందిన బ్రహ్మర్షి కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య శిరోమణి నృత్యోత్సవం 2025 పోటీల్లో 8 తరగతి విద్యార్థులు సిహెచ్.ప్రణీత, కె.శరణ్య, 7 తరగతి విద్యార్థులు టి.మణిశ్రీ, ఐ.చైత్రిక అత్యుత్తమ ప్రతిభ చూపి షీల్డ్‌లను, ప్రశంసాపత్రాలను పొందారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విజేతలైన విద్యార్థినులను సోమవారం పాఠశాల అధినేత డైరెక్టర్ కె.ముల్లారావు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రతిభ కనపరిచి స్కూలుకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల అధినేత ముల్లారావు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపి హరీష్‌మాథూర్

స్ఫూర్తి శిఖరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రజాస్వామ్యం, గణతంత్ర, లౌకిక దేశంగా భారతదేశం ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలబడడానికి కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తి శిఖరమని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం స్థానిక రెడ్డప్పవారిపేటలో ఏర్పాటుచేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని అమలాపురం ఎంపి హరీష్‌మాథూర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ నిరంతరం పోరాడారని వ్యాఖ్యానించారు. నాటి, నేటి, భావితరాలకు ఆయన ఒక స్ఫూర్తి శిఖరమని కొనియాడారు. అంబేద్కర్ బాటలో పయనించడం ద్వారా మనమంతా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు

భీమనపల్లి సొసైటీ అధ్యక్షునిగా పెద్ద

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి సహకార సొసైటీ అధ్యక్షునిగా భట్లుపాలెంకు చెందిన ఆకేటి పెద్ద నియమితులయ్యారు. సహకార సొసైటీ అధ్యక్షునిగా పెద్ద మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సొసైటీ అధ్యక్షునిగా నియమితులైన పెద్దను సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యులు దేశంశెట్టి నాగరత్నంకుమారి, నాగులపల్లి శేషవేణి, నీటి సంఘ డైరెక్టర్ మంచెం బాబి, తదితరులు అభినందించారు.

ఆకేటి పెద్ద

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రామచంద్రపురం: మండలంలోని వెల్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట** పట్టణంలోని 5వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొని ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, బుంగ సంజయ్, గుండు తాతరాజు, పాండ్రంగి సత్యనారాయణ, పాల్గొన్నారు. **కాట్రేనికోన** మండలంలోని పల్లం గ్రామంలో సుపరిపాలనలో తొలుగడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. **కొత్తపేట** మండలంలోని పలివెల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రామచంద్రపురంలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాట్రేనికోనలో బాలికతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

పిజిఆర్ఎస్‌లో వస్తున్న అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృసి చేయాలని డిఆర్‌ఒ బిఎల్ఎన్.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె ఇతర అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో విచారిస్తూ అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అన్నారు. ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీ పిజిఆర్ఎస్‌లో స్వీకరించబడవని, డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో నైపుణ్య అర్హతలను పరిశీలించి ఎంపికి చేయడం జరుగుతుందని అభ్యర్థులు గ్రహించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో 265 వినతులు స్వీకరించడం జరిగిందన్నారు. ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు, తల్లికి వందనం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ రాజకుమారి

కూలి రేట్లు పెంచాలంటూ ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రైస్ మిల్ కార్మికుల కూలి రేట్లు పెంపుదల చేయాలంటూ రైస్‌మిల్ కార్మికులు ధర్నా చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రైస్ మిల్లు యాజమాన్యాలతో చేసుకున్న ఒప్పందం ఏప్రియల్ 2024తో ముగిసిపోయిం దన్నారు. నాటి నుంచి నేటి వరకూ తిరిగి యాజమాన్యాలు వేతన ఒప్పందం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి యాజమాన్యాంతో ఒప్పందం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మీసాల శ్రీను, చిట్టూరి శ్రీనివాసరావు, కోసూరి జగన్నాథం, భూమిరెడ్డి వీరవెంకట సత్యానారాయణ, కడియాల అప్పారావు, ఎం.గణేష్, కర్రి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని విలసవిల్లి పంచాయతీలో వడ్డివారి దళిత పేట నుంచి భీమ్ నగర్ దళిత పేట వెళ్లేందుకు వేస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఊర్మిళదేవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భ:గా ఆమె మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఎస్‌సి పేటకు వెళ్లే రహదారి మట్టితోనే ఉండేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ నిధుల నుంచి రూ.10 లక్షల కేటాయించి గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. దసరాబుల్లోడు కోడుపై వంతెన నిర్మాణం పనులు జరుగుతున్నాయని, ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇక్కడి గ్రామస్తులతో పాటు దూరంలో ఉన్న గోకనవిల్లి ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ పర్యటనలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి

ధర్మప్రసాద్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండల వ్యవసాయ శాఖ అధికారి కడలి ధర్మప్రసాద్ సేవలు ప్రశంసనీయమని రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కరాటం రత్నప్రసన్న కొనియాడారు. ఇటీవల అంబాజీపేట మండలానికి బదిలీ అయిన ఆయనకు స్థానిక రెడ్డిపల్లిలో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్నప్రసన్న మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ అధికారిగా ధర్మప్రసాద్ రైతులకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఎవరు మనస్సు నొప్పించకుండా అందరితో మర్యాద పూర్వకంగా మెలిగారన్నారు. ఈ కార్యక్రమంలో కరాటం సూర్య భాస్కర్ రావు, కొలిశెట్టి జయప్రకాష్, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ రత్నప్రసన్న

పిఎం సూర్యఘర్ యోజనపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై సోలార్ రూఫ్‌టాప్ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1004 యూనిట్లకు కనెక్షన్లు ఇచ్చారని, ఆగస్టు 15 కల్లా మరిన్ని కనెక్షన్లు అందుబాటులోకి తేవాలన్నారు. పథకంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, 300 యూనిట్ల పరిమితి వాడకానికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఉత్పత్తికి పరిమితి లేదని అన్నారు. అధికారులు, మున్సిపల్, డిఎల్‌డిఒ, ఎంపిడిఒలు, బ్యాంకు ఎల్‌డిఎంలు, ఏజెన్సీలు కలిసి ప్రజలకు పథక ఫలితాలను వివరించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో, బ్యాంకు ఎల్‌డిఎం శ్రీవర్మ , ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆర్‌డిఒ డి.అఖిల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు ఏడుగురు పిజిఆర్ఎస్‌లో పాల్గొని అర్జీలను అందజేశారని తెలపారు. ఆయా అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

కాజ్ వే నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మూలస్థానం, తోకలంక మార్గంలో చేపట్టిన కాజ్ వే నిర్మాణ పనులను ఎంపిడిఒ ఎ.రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు, గ్రామస్తుల ఆర్థిక సాయం రూ.3 లక్షలతో కాజ్ వే నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. 5 అడుగుల వెడల్పు, 8 అడుగుల పొడవు కలిగిన 21 తూరలతో కాజ్‌వేను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గానుగుల చిన్న, ఆకుల సత్యనారాయణ, గోవిందరాజు, పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ



ఉపసర్పంచ్‌ని పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి

ఉపసర్పంచ్‌ని పరామర్శించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మామిడికుదురు

శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జనసేన నాయకుడు, పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి బుజ్జిని ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

చదువుకు పేదరికం ఆటంకం కారాదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

చదువుకి పేదరికం ఆటంకం కారాదని మెజీషియన్ శ్యామ్ జాదూగర్ అన్నారు. సోమవారం మండలంలోని ర్యాలీ గ్రామంలోని అన్నపూర్ణ డే కేర్ హోంలో చిన్నారులచే సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల పిల్లలకు పుస్తకాలు, పలకలు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం చదువుకి ఆటంకం కాకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వృద్ధులకు అన్నదానాన్ని న్విహించారు. ఇద్దరు చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనూస్ సభ్యులు డాక్టర్ మోహిత్, శ్యామ్, అన్నపూర్ణ, తేజశ్రీ, రుషిత్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ తల్లికి చెక్కును అందిస్తున్న ఎస్‌పి

కానిస్టేబుల్ జీవన్ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

గత నెల కోదాడ వద్ద జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ సుంకర బ్లెస్సన్ జీవన్ కుటుంబ సభ్యులకు 2018 కానిస్టేబుల్స్ బ్యాచ్ ఆర్థిక సాయాన్ని అందించారు. సేకరించిన నగదు రూ.2,73,700లను ఎస్‌పి బి.కృష్ణారావు చేతుల మీదుగా సోమవారం అమలాపురంలో జీవన్ తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా 2018 బ్యాచ్ కానిస్టేబుల్‌ను ఎస్‌పి అభినందించారు.

శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన దాతలు వాయువేగుల శ్రీరామారావు, శ్యామల సుభద్ర కుటుంబ సభ్యులు రూ.11,111 విరాళాన్ని అందజేశారు. తొలుత స్వామి వారిని వారు దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వరద పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గోదావరి వరదల పట్ల లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కేదార్లంక, అద్దంకివారిలంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరద పరిస్థితిపై గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వరదల వస్తే తీసుకోవాల్సిన చర్యలపై అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

'నోరు అదుపులో పెట్టుకో...'

ప్రజాశక్తి - అంబాజీపేట

వీరవెంకటసత్యనారాయణ

ఎంఎల్‌ఎగా ఇసుక, మట్టి అక్రమ రవాణా, భూ దందాలకు పాల్పడిన చిర్ల జగ్గిరెడ్డి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అదోగతి పాల్జేశారని, అటువంటి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు టిడిపి అధినేత,సిఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తుంటే చూసి ఓర్వలేక చిర్ల జగ్గిరెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురి చేసినందుకే వైసిపికి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, కేవలం 11 సీట్లకు పరిమితం చేసిన వైసిపి నేతలకు బుద్ధి రాలేదని అన్నారు.

ఎంఎల్ఎల ప్రమాణ స్వీకారోత్సవంలో అశోక్

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కేంద్ర హోమ్ శాఖ మంత్రి, ముగ్గురు నామినేటెడ్ ఎంఎల్ఎలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రిగా ఎ.జాన్ కుమార్, నామినేటెడ్ ఎఎల్ఎలుగా తిప్పైన్తన్, జిఎన్ఎస్.రాజశేఖరన్, సెల్వం వేలాయుధం ముఖ్యమంత్రి రంగసామి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరయ్యారు.

ఎల్ఎడి డైరెక్టర్ శక్తివేల్‌తో ఎంఎల్ఎ భేటీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎల్ఎడి డైరెక్టర్ శక్తివేలును స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను డైరెక్టర్‌తో చర్చించారు. ఆది ద్రావిడ, ఎంఎల్ఎ నిధులు సుమారు రూ.7 కోట్లు మంజూరయ్యాయని, కానీ వాటికి ఇప్పటివరకు వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని సంబంధిత ఫైలును తక్షణమే పరిశీలించి అభివద్ధి పనులు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

దొండపూడి, వెంకటాయపాలెం గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై దాడులు చేసి 20 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. సిఐ బిఎన్.నాయక్ పర్యవేక్షణలో వెంకటాయపాలెం గ్రామ శివారు పామాయిల్ తోటలో దాడుల చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.3,800 నగదు, 2 కోడి పుంజులు, 2 కత్తులు సీజ్ చేశామన్నారు. దొండపూడి గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8,020 నగదును, 2 కోడి పుంజులు, 2 కత్తులు సీజ్ చేశామని తెలిపారు. రెండు చోట్ల మొత్తం 20 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం, జగ్గంపేట

పేకాట ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కృష్ణుని పాలెం పంచాయతీ వెంకటాపురం గ్రామం శివారు చిలక్కొండ వద్ద పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. పది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.7వేల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ రఘునాథ్ రావు, సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - కొవ్వూరు

చాగల్లు రైల్వే స్టేషన్ నుంచి నిడదవోలు ఆర్ఎస్ మధ్య సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. రైలు నుంచి జారి పడినట్లు మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతుడు కుడి చేతిపై నెమలి పించం పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని నిడదవోలు ఆర్‌పి హెచ్‌సి డి.శ్రీనివాసరావు తెలిపారు వివరాలకు 9490617090, 9948010061 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తునిలో పట్టపగలు భారీ చోరీ

ప్రజాశక్తి - తుని

తుని పట్టణంలో సోమవారం పట్టపగలు భారీ చోరీ చోటు చేసుకుంది. కోమాకుల వారి వీధిలో నక్కా లోకేష్ ఇంట్లో ఇంటి తాళాలు పగలగొట్టి రూ. పది లక్షల విలువైన బంగారం, రూ.4 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్ళారని బాధితులు తుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ సహకారంతో ఆధారాలు సేకరిస్తున్నారు. పూర్తిస్థాయిలో కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సిఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సంగాడి సూరిబాబు (40) వేటకు వెళ్లి మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. మృతుడు సూరిబాబుతో కలిసి మరో అయిదుగురు ఫైబర్ బోటులో 13వ తేదీ రాత్రి సముద్రంలోకి వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు సూరిబాబు బోటు నుండి పడి పోయి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు.

లారీ డ్రైవర్ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోటనందూరు మండలం బిళ్లనందూరుకు చెందిన ట్యాంకర్ లారీ డ్రైవర్ పెదరెడ్ల రామారావు (40) మృతదేహం సోమవారం సుంకరపాలెంలో లభ్యమయ్యింది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన ట్యాంకర్ ఢీ కొనడంతో ఈ నెల 8వ తేదీ పటవల వద్ద ఒక మహిళ మతి చెందిన నేపథ్యంలో ఆమె మరణానికి తానే కారణమని అదే రోజు విషం తాగి డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సుంకరపాలెం ప్రాంతంలో ఒక వ్యాపార సంస్థ వద్ద సోమవారం రామారావు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

బస్సు వేయాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

కాకినాడ ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న ఉప్పాడ విద్యార్థులకు బస్సు కష్టాలు తప్పడం లేదు అద్దరిపేట నుంచి ఉప్పాడ చేరుకునేసరికి బస్సు నిండు పోవడంతో ఉప్పాడలో నిలుపుదల చేయడం లేదని విద్యార్థులు సోమవారం అద్దరిపేట కాకినాడ బస్సును నిలుపుదల చేసి ఆందోళన చేపట్టారు. ప్రతిరోజు ఉదయం వస్తున్న బస్సు కిక్కిరిసిన జనాలతో అద్దరిపేట నుండి వస్తుందని బస్సు ఖాళీ లేకపోవడంతో నిలుపుదల చెయ్యకపోవడంతో అమీనాబాద్, ఉప్పాడ, మూలపేట, కొత్తపల్లి విద్యార్థులు సరైన సమయానికి కాకినాడ చేరుకోలేకపోతున్నామని గగ్గోలు పెడుతున్నారు. కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి బస్సును పంపించారు. జనసేన నాయకుడు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ఆర్‌టిసి డిఎంతో మాట్లాడడంతో ఆర్‌టిసి అధికారులు బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

17న బిసి సంక్షేమ సంఘం మహాసభ

ప్రజాశక్తి - కాకినాడ

జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ మహాసభ ఈ నెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుండల సాయి కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన స్వగృహంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వియ్యపు అప్పలస్వామి, పంచకట్ల రామకృష్ణ, మరుకుర్తి వీర గంగాధర్, చీపురుపల్లి రాఘవ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

మహాలక్ష్మి

మామిడికుదురుకు చెందిన శతాధిక వృద్ధురాలు అన్నంనీడి మహాలక్ష్మి (101) సోమవారం మృతి చెందారు. చనిపోయే వరకు ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఉన్నారు. గత 25 సంవత్సరాల నుంచి ఆమె చనిపోయే వరకు ఒంటి పూటే భోజనం చేస్తూ ఉండేది. ఈమెకు ఇద్దరు కుమారులు. వారిలో ఒక కుమారుడు అన్నమనీడి తిరుపతిరావు స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో పిఇటిగా పనిచేస్తున్నారు. ఆమెకు ఒక కుమార్తె, 9 మంది మనవలు, 15 మంది మునిమనవలు ఉన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

అల్లవరం మండలం, ఓడలరేవు గ్రామానికి చెందిన మల్లాడి భాస్కరరావు, S/o. మల్లాడి సూర్య సత్య కుమార స్వామి కి చెందిన **K8542309** నెంబరు కల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 5 జూలై 2025న ఓడలరేవులోని మా ఇంటి నుండి బెండమూర్లంక వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
మల్లాడి భాస్కరరావు,
S/o. మల్లాడి సూర్య సత్య కుమార స్వామి,
గ్రామపంచాయతీ రోడ్డు, ఓడలరేవు,
అల్లవరం మండలం- 533210,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్:9949954239

మహారాజశ్రీ A.J.F.C.M కోర్టువారి దివ్య సముఖమునకు అమలాపురం
O.S.No.334/2022

Between:
నడింపల్లి హరికృష్ణంరాజు ...వాది
మరియు
నడింపల్లి వెంకటపతిరాజు ...ప్రతివాది

పేపరు ప్రకటన

ప్రతివాది. Nadimpalli Venkatapathi Raju, S/o.Narayana Raju, Hindu, age 82 years, Komaragiripatnam, Allavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema Dist.

పై నెంబరు దావాలో O.S.No.334/2022 లో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీకు అమలు జరిగియుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన మేయమని ఆర్డరు పాస్ చేసినారు. వాయిదా **17-07-2025వ** తేదీన వాయిదా అయి వున్నది. ప్రతివాది అయిన మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారు ద్వారా గాని వాయిదా రోజున శ్రీ కోర్టు నందు హాజరు కావలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా: ది.17-07-2025న ఉదయం గం॥ 10.30 ని॥లకు

శ్రీ కె.మల్లపరాజు
అమలాపురం శ్రీ కె.ఎస్.శ్రీరామ్
ది.13-7-2025 అడ్వకేట్స్, అమలాపురం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. No. 770/2024
O.S. No. 19/2020

Between:
Adapa Adinarayana Murthy, S/o. Brahmadevudu, Hindu, aged 35 years, resident of Vanapalli, Kothapeta Mandal, Kothapeta JCJC.
...Petitioner/ Plaintiff
AND
Maddi Kejiya, W/o. Vara Prasad, Hindu aged 41 years, Property, R/o. D.No. 29-21-1/1, Lakshmivarapu peta, Rajamahendravaram, Rajamahendravaram JCJC.
...Respondent/ Defendant

పై నెంబరు పిటిషనులో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషనును మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **కవి హనుమంతరావు**
14-7-2025 అడ్వకేట్, రాజమండ్రి

NOTICE

Under the instructions of my client i.e., The Branch Manager, Tata Capital Housing Finance limited, Door No. 86-1-9, Second Floor, B-Square, opposite to Ravindra Bharathi School, J. N. Road, Rajamahendravaram, I hereby issue the following notice to the public in General.

1. Sri. Nagaraboyina Chanti, S/o. Simhachalam, approached by client for loan on his Property covered by Settlement Deed dated 22-01-2025 Registered as document No.430/2025, in the office of SRO., Kadiyam.

2. My client verified the documents and willing to sanction loan Sri. Nagaraboyina Chanti, on his property covered by the above Settlement Deed.

3. If anybody got any attachments, injunctions, or objections for sanction of loan on the property covered by the above Settlement Deed to Sri. Nagaraboyina Chanti, they may inform them to my client or to me within seven days from the date of issue of this notice, failing which my client will treat the property as free hold and of proceed further for sanction of loan to Nagaraboyina Chanti.

4. Schedule of Property:

East Godavari District, Kadiyam Sub-Registry, Rajamahendravaram Rural Mandalam, Morampudi Revenue Measurement area Satellite City Gram Panchayath area, Survey No.11/2 in it site consisting of 72.53 Sq.yards, along with ground and first floor (G+1) Building bearing door No.106-3-1079, bounded by :

EAST: House of Bhukailash - 19.4 ft. **WEST:** Road - 19.4 ft. **NORTH:** House belongs to B. Raju - 34.0 ft, **SOUTH:** House of T. Manga - 34.0 ft.

Within the above boundaries site consisting of 72.53 Sq.yards or 60.64 Sq. meters, along with Ground and First Floor (G+1) Building bearing door No.106-3-1079, with Electrical Service connection No. 143380630 9016930, etc., along with all usual easement rights.

D.V.KRISHNA RAO
Advocate, Flat No.102, D.No. 25-1-45,
Rajahmundry Kambala cheruvu
Dt.14-7-2025 Rajahmundry
Cell: 9490178358

BEFORE THE HONOURBLE A.P. CO-OPERATIVE TRIBUNAL VIJAYAWADA
MP No. 171 of 2024
IN
O.P. No. 4 of 2019

Between:
The Jayalakshmi Mutually Aided Multi purpose Co-Operative Mutually Society Limited (Regd. No. AMC/E.G.Dt.) DCO/99/4, rep.by Vice-Chairman Polaki Venkata Ramana Murthy, Son of lat Manmadha Rao, Aged about 64 years, Vice- Chairman, D.No.9-54/3, Sri Lakshmi Complex, Sarpavaram Junction, Kakinada-5
.... Petitioner
And
1) Kala Usha Devi,
2) Chavali Sai Sridevi ....Respondents
To
Kala Usha Devi, (1st Respondent) Wife of late Kala Bharatha Sastry, Aged about 67 years, House Wife, Resident of D. No. 4-56, Nagarjuna Colony, Valasapakala, Kakinada, East Godavari District-533005.

Please take notice that the above petition (final Decree petition) for recovery of the amount and Honorable Tribunal ordered Notice to you and posted the case to 05-08-2025 for your appearance. So you are hereby to appear before the above Hon'ble Tribunal On 05-08-2025 at 10.30 a.m. in person or through your Advocate in the above petition, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Tribunal)
Date of Adjournment: 05-08-2025
T. Anjaneyulu,
Advocate, Vijayawada.

మహారాజశ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ వారి ముందు
F.A. No. 637/2024

Dudala venkata Rao & Another
.... Appellants
And
Geddam Prasada Rao & others
.... Respondents

1) Alturima Infra Private Ltd., Rep by its Chairman & M.D. Sri Maddireddy Yesubabu Naidu, D.No.4-1209/75, Marthanda Nagar, New Hafizpet, MIyapur, Hyderabad.
2) Alturima Infra Private Ltd., Rep by its Chairman & M.D. Sri Maddireddy Yesubabu Naidu, D.No. 73-12-4, 1st Floor, Prem Towers, Near Municipal School, Narayanapuram, Rajahmundry.
3) Maddireddy Yesubabu Naidu, S/o Maddireddy Veeraju, D.No. 73-12-4, 1st Floor, Prem Towers, Near Municipal School, Narayana puram, Rajahmundry.
4) Suramudi Satyanarayana S/o venkayya, D.No. 1-6, Main Road, Navav peta-533232, East Godavari Dist. A.P.
5) Surampudi Swamy Narayana, S/o Late S. Satyanarayana, D.No.1-6, Main Road, Navavpeta - 533232, East Godvari Dist, A.P.
6) Madireddy Adi Lakshmi, W/o Yesubabu Naidu, D.No. 73-12-03/4/101, Harinya Plaza, Burugu Chettu Street, Narayana puram, Rajahmundry Urban, East Godavari District, A.P. - 533103.

పై నెంబరు అప్పీల్ ప్రతివాదులైన నెంబర్ R2, R3, R4, R5, R8 & R9 పై రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ వారి ఎదుట హాజరు నిమిత్తం ది. 7-8-2025నకు వాయిదా అయివున్నది. కావున పై ప్రతివాదులైన నెంబర్ R2, R3, R4, R5, R8 & R9 ది. 07-08-2025న ఉదయం 10-15 గం.లకు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపు కొనవలయును. లేనియెడల దావాలు పై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

(శ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ ఉత్తర్వులననుసరించి)

డి.సత్యశివదర్శన్, అడ్వకేట్,
ఆర్‌కె.ఎన్‌క్లేవ్, శ్యామ్‌నగర్, లబ్బీపేట,
విజయవాడ. ఫోన్ : 9432020748